మానవత్వం చాటుకున్న హోంమంత్రి


ఆటో వద్దకు వెళ్లి సాంబశివకుమార్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర హోంమంత్రి వనిత

కొవ్వూరు: రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత తన మానవత్వాన్ని చాటుకున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి కాన్వాయ్‌లో వెళుతుండగా తనను కలవడానికి వచ్చిన కొవ్వూరుకు చెందిన కొమ్మి సాంబశివకుమార్ దివ్యాంగుడిని చూసిన మంత్రి వనిత కారు దిగి ఆటో దగ్గరకు వెళ్లి అతనితో మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ నాలుగో అంతస్తు నుంచి పడిపోవడంతో వెన్నుముకకు బలమైన గాయమై రెండు కాళ్లు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమయ్యానని, పింఛను పెంపుతో పాటు మెరుగైన వైద్యం అందించాలని శివకుమార్ కోరాడు. దీనికి మంత్రి వనిత స్పందించి సంబంధింత అధికారులతో మాట్లాడి సాంబశివకుమార్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.















గోనె సంచులను సిద్ధంగా ఉంచుకోవాలి

- ఆర్డీవో ఎస్.మల్లిబాబు
- 162 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రంలో సేకరించాలని, దానికి కావాల్సిన గోనె సంచులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డివిజన్‌లో ధాన్యం సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు, డివిజన్‌లో వరిసాగు ద్వారా 3,18,343 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని, దీనిలో 1,82,432 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే సాంకేతిక పరమైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారించాలన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా మిల్లర్లు గోనె సంచులు ముందే సిద్ధం చేసుకోవాలన్నారు. ఉండ్రాజవరం మండలానికి కేటాయించిన మిల్లర్లు అవసరమైన మేరకు గోనె సంచులు ఇవ్వడం లేదని తహసీల్దార్ ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. డివిజన్‌లో ఉన్న 162 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలని, ఏవిధమైన ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. రైతుల వద్ద సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని షెడ్యూలు ప్రకారం సేకరించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజనల్ సహకార అధికారి కె.సుబ్బారావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, వ్యవసాయ ఏడీ చంద్రశేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి గంగాధర రావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని వరి రైతులకు ధాన్యం అమ్మకాలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్ శ్రీదేవి సూచించారు. కొవ్వూరుపాడులో సోమవారం గోనె సంచుల నిల్వలను ఆమె పరిశీలించారు.

నిడదవోలు రూరల్: ప్రతి రైతు నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. రావిమెట్లలో ఆర్‌బీకే కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మండలంలోని 22 ఆర్‌బీకేల వద్ద 4.20 లక్షల గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఆదిశేషయ్య


గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య

గోపాలపురం: మెట్టప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకుకు తగిన గిట్టుబాటు ధరలు కల్పించాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య కంపెనీ బయ్యర్లకు సూచించారు. ఆయన రీజనల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది మొదటి సారిగా గోపాలపురం పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిశేషయ్య మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. గత ఏడాది సరాసరి ధరలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురైనట్లు వివరించారు. పొగాకు బోర్డు నిర్దేశించిన 47.80 మిలియన్ కిలోలకు గానూ రైతులు 53 మిలియన్ పొగాకు ఉత్పత్తి చేసినట్టు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకూ 5.23 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరిగాయని, అందులో కిలో సరాసరి ధర రూ.196.62 ఉన్నట్లు ఆర్ఎం పేర్కొన్నారు. రైతులు గ్రేడింగ్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించి పొగాకులో అవశేషాలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట సీనియర్ గ్రేడింగ్ అధికారిణి టి.హేమశ్మిత,బోర్డు అధ్యక్షులు పిన్నమనేని మధుమోహన్, ఇల్లూరి పెంటరాజు, కార్యదర్శి ఇల్లూరి రాంబాబు, ఉపాధ్యక్షుడు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, రైతులు కూసం రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొవ్వూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాల అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఒకటో వార్డు సచివాలయ పరిధిలోని వలంటీర్లతో ఆమె సమీక్ష సమావేశంలో నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అర్హత ఉండి ఏదైనా కారణం వల్ల పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే గుర్తించి వారి జాబితాలను తయారు చేయాలని ఆదేశించారు. అనర్హత ఉంటే లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వత వ్యక్తిగతంగా ఏఏ పథకాల ద్వారా లబ్ధిపొందారో వివరించాలని సూచిం చారు.

భూసర్వేతో సమస్యల పరిష్కారం


ఖండవల్లిలో డ్రోన్ కెమెరాను ఎగుర వేస్తున్న ఎంపీపీ కార్చెర్ల, తహసీల్దార్ రాజ రాజేశ్వరి, అధికారులు

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సమగ్ర భూసర్వే వల్ల గ్రామాల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఖండవల్లిలో భూసర్వే నిమిత్తం సోమవారం డ్రోన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ పెరవలి మండలంలో 13 రెవెన్యూ గ్రామాల్లో 12 గ్రామాలు సర్వే ఇప్పటికే పూర్తయిందన్నారు. ప్రస్తుతం ఖండవల్లి గ్రామంలో భూసర్వే జరుగుతుందని తెలిపారు. ఈ గ్రామం విస్తీర్ణం 3341 ఎకరాల్లో సర్వే చేయాలని, గోదావరి లంకలను ఉన్నాయని తెలిపారు. డీటీ కనకదుర్గ, ఆర్ఐ పావని, సర్పంచ్ నాగరాజు, సర్వేయర్ వి.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కందా వెంకన్న రామకృష్ణ, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేస్తే ఇళ్లను కోల్పోతాం

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించిన ఏటిగట్టు ప్రజలు


మున్సిపల్ కమిషర్ శ్రీకాంత్‌కి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు, కౌన్సిలర్ మురళీకృష్ణ

కొవ్వూరు: ఏటిగట్టు రోడ్డు వంద అడుగులు వెడల్పు చేయాలని ప్రతిపాదన వల్ల పట్టణంలో రోడ్డు పక్కన ఉన్న తమ నివాసాలను కోల్పోతామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ స్థానికులు సోమవారం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆరికిరేవుల నుంచి వాడపల్లి వరకూ ఏటిగట్టు వెంబడి గ్రామాలు మాస్టర్ ప్లాన్‌లో ఉండడంతో రుడా ఈ రోడ్డుని 100 అడుగులు వెడల్పు చేయడానికి ప్రతిపాదించారన్నారు. ఈ ప్రతిపాదన కారణం పేదలు నివాసాలు కోల్పోయి నిరాశ్రయులవుతా రన్నారు. ముఖ్యంగా గోదావరి మాత విగ్రహం నుంచి రోడ్డు కం రైలు వంతెన టోల్‌గేట్ జంక్షన్ వరకూ రోడ్డు పక్కన నివాసం ఉంటున్న అనేక మంది పేదలు ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఉందని, వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు బుక్‌లెట్ అందజేస్తున్న గృహసాధులు

దేవరపల్లి: జగనన్నే మా భవిషత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి గోపాలపురం నియోజవర్గంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలోని తన గృహం వద్ద సోమవారం గృహసారథులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలను తెలుసుకుని, గోడపై స్టిక్కర్ అంటించారు.అనంతరం బ్రోచర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్నే మా భవష్యత్తు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, యాదవోలు గ్రామకమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, ప్రభుత్వ జనరంజక పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, విజ్జేశ్వరం, అట్లపాడు, డి.ముప్పవరం గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సోమవారం నిర్వహించారు. తిమ్మరాజుపాలెంలో పల్లారావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముప్పిడి చంద్రశేఖర్, తిక్కా శ్రీనివాస్, నాగిరెడ్డి నాగదేవి, ఎంపీటీసీలు రంగారావు, సత్యనారాయణ, సుజాత, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కొవ్వూరు: అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి కె.రాముడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలు నాలుగో రోజు సోమవారం పట్టణంలో మూడు డబాల వీధిలోని నారాయణ విద్యా సంస్థలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు మాక్ డ్రిల్ చేసి చూపించారు. విద్యా సంస్థల్లో ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఏవిధంగా బయటపడాలి తదితర వాటిని వివరిచంఆరు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

నిడదవోలు రూరల్: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాసరావు సోమవారం అవగాహన కల్పించారు.

ఏపీ పీసీసీ అధ్యక్షుడి రాక

కొవ్వూరు: ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సోమవారం కాపవరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్ స్వగృహానికి విచ్చేశారు. రఫీ కోడలు ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహేబేగ్ కాలికి గాయం కావడంతో ఆమెను పలకరించారు. ఈ సందర్భంగా గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గ నాయకులతో ఆయన ఇష్టాగోష్టి నిర్వహించి పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజమహేంద్రవరంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమానికి వెళ్లారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

కొవ్వూరు: విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశంలో తమ అభిప్రాయాలను వెలిబుచ్చిన సీనియర్ న్యాయవాదులకు సీఐడీ పోలీసులు 160సీఆర్‌పీ కింద నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, జేడా శ్రావణ్‌కుమార్ భావన ప్రకటన స్వేచ్ఛలో భాగంగా చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తే నోటీసు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతీ ప్రశ్నించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు ఐవీ సుబ్బారావు, చలపతి రావు, మురళీకృష్ణ, చిట్టిబాబు, తాతరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

పెరవలి: ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న 13 ఎకరాల విస్తీర్ణం ఉన్న నాగుల చెరువు అభివృద్ధి పనులను సోమవారం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ చెరువుకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు శ్రద్ధ తీసుకొని నిధులు కేటాయించారన్నారు. ఈ చెరువుపై ఆధారపడిన రజకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

ఉండ్రాజవరం: మండలంలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకూ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు సోమవారం తెలిపారు. 18న మోర్త, కాల్దారీ, 19న మోర్త, సూర్యారావుపాలెం, 20న కె.సావరం, పసలపూడి సచివాలయల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంపులో సచివాలయం ద్వారా ఆధార్ సేవలు, మొబైల్ నంబర్ లింకు, బయోమెట్రిక్, అప్డేట్ వంటి మార్పులు చేస్తారని తెలిపారు.

నిడదవోలు రూరల్: ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ టి.మూర్తిబాబు సోమవారం తెలిపారు. 18న తాడిమళ్ల, గోపవరం, 19న తాడిమళ్ల, పురుషోత్తపల్లి, 20న తాడిమళ్ల, విజ్జేశ్వరం గ్రామాల్లో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు.

సూర్యారావుపాలెం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా తమ్మిరాజు

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా చామర్తి తమ్మిరాజు, సభ్యులుగా గుల్లపల్లి ఉదయ భాస్కరరావు, ఘటోత్కజుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీరిని పలువురు అభినందించారు.

పెండ్యాల సొసైటీ అధ్యక్షుడిగా రామచంద్రరాజు

నిడదవోలు రూరల్: పెండ్యాల పీఏసీఎస్ అధ్యక్షుడిగా చేకూరి రామచంద్రరాజు, డైరెక్టర్లుగా వాకా వీరవెంకట సత్యనారాయణ, వెలగన కనకయ్యలను నియమించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక రైతులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కారింకి అన్నవరం, ఉపసర్పంచ్ బైర్రాజు సత్యరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ సాగిరాజు కృష్ణంరాజు, సీనియర్ నాయకులు వడ్లమూడి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘం సమావేశం

కొవ్వూరు: పురపాలక సంఘం అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్‌పై సభ్యులతో సమీక్షించనున్నట్టు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ఉండ్రాజవరం: అనారోగ్య సమస్యలతో ఒక వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన పాలంగిలో జరిగింది. ఏఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పాలంగి గ్రామానికి చెందిన వి.పెద్దిరాజు(52) గత కొంత కాలంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ బాధను తట్టుకోలేక ఆదివారం రాత్రి పెద్దిరాజు పడుకున్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్క గదిలో ఉన్న కొడుకు ఉదయం చూసేసరికి తండ్రి ఫ్యాన్‌కు వేళాడుతున్నాడు. వెంటనే తణుకు ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుని కుమారుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాల్దారీలో చోటు చేసుకుంది. ఎస్సై కె.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కాల్దారీ రోడ్డులో సైకిల్‌పై వెళుతున్న గ్రామానికి చెందిన బాతు ముసలయ్య(78)ను సత్యవాడ నుంచి చాగల్లు మోటారుసైకిల్‌పై వెళుతున్న చాగల్లు గ్రామానికి చెందిన కోరుకోండ అప్పారావు ఢీకొన్నాడు. ముసలయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని తణుకు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

హెచ్‌ఎంలకు ఓఎమ్మార్ షీట్ల అందజేత

తాళ్లపూడి: ఈ నెల 20వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ జరగనున్న సమ్మేటివ్–2 ఫైనల్ పరీక్షలకు ఓఎమ్మార్ షీట్లను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు ఎంఈవో కె.వివేకానంద తెలిపారు. మండలంలో 1300 మంది విద్యార్థులున్నారని, వీరికి ఓఎమ్మార్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా సోమవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఓఎమ్మార్ షీట్లను సీఆర్‌పీలు అందజేశారు.















